**ఈ రోజు (03.06.2018) యం.బి.విజ్ఞానకేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశ తీర్మానాన్ని ప్రచురణార్థం మీడియాకు పంపుతున్నాము. – జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి**

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా

# 9న రాస్తారోకో

రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులను తగ్గించాలని డిమాండ్

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో చేయాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, లారీ ఓనర్స్, ట్యాక్సీ ఓనర్స్, పెట్రోల్ బంక్ డీలర్స్ ట్యాక్స్ పేయర్స్ కన్స్యూమర్ ఫోర్ అసోసియేషన్ వినియోగదారులు, ఆటో, ముఠా కార్మికసంఘాలు తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులను సగానికి సగం తగ్గించాలని సమావేశం డిమాండ్ చేసింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాటాడుతూ పెట్రోల్ అసలు ధర కన్నా పన్నులే ఎక్కువగా ఉందన్నారు. పెట్రోల్ అసలు ధర రూ. 38 కాగా, పన్నులు రూ. 48, డీజిల్ అసలు ధర రూ. 41 ఉండగా పన్నులు రూ. 35 కావడం ఘోరమన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, తెలంగాణాలో కన్నా ఎపిలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్‌పై ఎక్సైజ్ పన్ను 105 శాతం, డీజిల్‌పై 335 శాతం పెరిగిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర తగ్గినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు పెంచడంవల్ల వినియోగదారులకు పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గలేదన్నారు. పెట్రో ధరల పెంపునకు నిరసనగా ఈ నెల 9న ఉదయం గం 10 నుంచి 11 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకొకు పిలుపునివ్వాలని ఆయన ప్రతిపాదించగా రౌండ్ టేబిల్ సమావేశంలో పాల్గొన్నవారంతా బలపర్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాటాడుతూ మనకన్నా వెనుకబడిన దేశాల్లో కూడా లీటర్ పెట్రోల్ ధర రూ. 40 లోపే ఉండగా, మన దేశంలో మాత్రం రూ. 84 ఉందన్నారు. మోడీ సర్కారు లీటర్‌కు ఒక్క పైసా తగ్గిస్తే కేరళలో పినరాయ్ విజయన ప్రభుత్వం రూపాయి తగ్గించిందన్నారు. ప్రజల ప్రయోజనాలపట్ల వామపక్షాల చిత్తశుద్ధికి అది నిదర్శనమన్నారు.

పెట్రోల్ బంక్ డీలర్స్ అసోసియేషన్ అఖిలభారత నాయకులు యం.నారాయణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల వల్ల వినియోగదార్లతోపాటు 55 వేల మంది డీలర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులను శాతంగా కాకుండా లీటర్‌కు ఇంత చొప్పున అని నిర్ణయించాలని కోరారు. జనసేన నాయకులు ముత్తంశెట్టి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్రం పెట్రోల్ ధరను పైసా తగ్గించడం సిగ్గుచేటన్నారు. పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కేరళ తరహాలో పన్నులు తగ్గించాలన్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి యం.సదాశివరావు మాట్లాడుతూ డీజిల్ ధర పెరగడం వల్ల లారీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. డీజిల్‌పై రూ. 4 తగ్గించమని సిఎం చంద్రబాబును కోరినప్పటికీ ఫలితం లేదన్నారు. టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు యం.రామ్‌గోపాల్ మాట్లాడుతూ కేరళ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఎపిలో ధర తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సత్తా నాయకులు చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ రవాణా రంగంపై ఆధారపడ్డ 30 లక్షల మంది జీవితాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుకుంటున్నాయన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌తో పాటు గ్యాస్ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందన్నారు.

ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఈశ్వర్, సిపిఐ(ఎంఎల్) నాయకులు జె.కిషోర్ బాబు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు యం.వి.ఆంజనేయులు, వినియోగదారుల ఐక్య వేదిక నాయకులు కె. రమేష్, రాజధాని ప్రాంత రైతు నాయకులు అనుమోలు గాంధీ, జనవిజ్ఞాన వేదిక నాయకులు డా॥ రవికుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె.దుర్గారావు, ఎఐటియుసి నాయకులు వెంకటప్పయ్య, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు జమిందార్, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రామారావు, సుంకరి రమేష్, కెవిపియస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, సిపియం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ కార్యదర్శివర్గ సభ్యులు డి.కాశీనాథ్ పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

=====